# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

టీమీడియా ప్రత్యేక అనుబంధం

సంపుటి : 8
సంచిక : 9
పేజీలు : 3

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ





# దేశానికి రోల్ మోడల్..

# వ్యవసాయ మార్కెట్

రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద వ్యవసాయ మార్కెట్ అయిన ఖమ్మం మార్కెట్, ఇప్పుడు దేశానికే ఆదర్శంగా నిలవబోతున్నది. రూ.155.30 కోట్లతో పునర్ నిర్మాణం జరుగుతోంది. ఆరు షెడ్లు, 2.50 లక్షల బస్తాల సామర్థ్యం, కోల్డ్ స్టోరేజీ, మిర్చి ప్రాసెసింగ్ యూనిట్లతో సమగ్ర అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దూరదృష్టి, కలెక్టర్ అనుదీప్ అకుంఠిత దీక్షతో ఈ మార్కెట్ సరికొత్త రూపు సంతరించుకుంటోంది. అధికారులు, కాంట్రాక్టర్లకు ఏఎంసీ చైర్మన్, సెక్రటరీ సూచనలు చేస్తూ పనుల వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నారు. మార్కెట్ లో డిజిటలైజేషన్, ఎల్ఈడీ బోర్డులు, ఆర్ఓ వాటర్ ప్లాంట్లు, హెల్త్ సెంటర్, ఇస్కాన్ సహకారంతో రూ.5కే భోజనం వంటి సౌకర్యాలు రైతులకు అందనున్నాయి. రైతుల కష్టాలు తీర్చి, వారి ఉత్పత్తులకు మంచి ధర పలికేలా, అన్ని వసతులతో కూడిన ఈ మార్కెట్ సంక్రాంతి నాటికి అందుబాటులోకి రానున్నది.

- ఖమ్మం అగ్రికల్చర్ మార్కెట్‌కు కొత్తరూపు
- రూ.155.30 కోట్లతో పునర్ నిర్మాణ పనులు
- 2.50 లక్షల బస్తాల కెపాసిటీతో నిర్మాణం
- మార్కెట్‌లోనే మిర్చి ప్రాసెసింగ్ యూనిట్లు
- కొత్త షెడ్లు, ప్రత్యేక కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు
- రైతుల కోసం విశ్రాంతి గదులు, హెల్త్ సెంటర్
- ఇస్కాన్ సహకారంతో అన్నదాతలకు భోజనం.!
- డిజిటలైజేషన్‌తో పారదర్శక లావాదేవీలు
- మంత్రి తుమ్మల, కలెక్టర్ ప్రత్యేక పర్యవేక్షణ
- పనుల వేగవంతానికి చైర్మన్, సెక్రటరీ చర్యలు
- సంక్రాంతికి రైతులకు అందుబాటులోకి రానున్న మార్కెట్
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు




**టీమీడియా, ఖమ్మం జిల్లా బ్యూరో :**
ఖమ్మం వ్యవసాయ మార్కెట్, రాష్ట్రంలోనే వరంగల్ తర్వాత రెండో అతిపెద్ద మార్కెట్‌గా పేరొందింది. ఏళ్ల తరబడి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి, వారికి అత్యుత్తమ సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో, రూ. 155. 30 కోట్ల భారీ వ్యయంతో ఈ మార్కెట్‌ను సమగ్రంగా ఆధునీ కరిస్తున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో, ఈ మార్కెట్ దేశంలోనే ఒక మోడల్ మార్కెట్‌గా రూపుదిద్దుకుంటోంది. ఈ ఆధునికీకరణ ప్రక్రియలో భాగంగా, మార్కెట్ లోపల అమ్మకాలు, కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేలా, రైతులకు, వ్యాపారులకు, ఉద్యోగులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అత్యాధునిక నిర్మాణాలను చేపడుతున్నారు.

## రైతులకు అత్యాధునిక సౌకర్యాలు

ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధునికీకరణలో భాగంగా, రైతులకు అనేక అత్యాధునిక సౌకర్యాలను కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతూ, 2. 50 లక్షల బస్తాల వరకు నిల్వ చేసుకునేలా విశాలమైన నిర్మాణాలు



చేపడుతున్నారు. ముఖ్యంగా, మిర్చిని నిల్వ చేసుకోవడానికి, మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకునేలా రైతులకు తోడ్పాటు అందించేందుకు, 1 లక్ష బస్తాల సామర్థ్యంతో ప్రత్యేక కోల్డ్ స్టోరేజీలను నిర్మిస్తున్నారు. అంతేకాకుండా, మార్కెట్ లోనే మిర్చి ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నారు. సోలార్ ప్యానల్స్ ఏర్పాటుతో, కోల్డ్ స్టోరేజీలు, వేర్‌హౌస్ షెడ్లు పునరుత్పాదక ఇంధన వనరులతో పనిచేయనున్నాయి.

## మెరుగైన వసతుల కల్పన

రైతులు తమ ఉత్పత్తులను నాణ్యతా ప్రమాణాలతో విక్రయించుకునేలా, సరుకు నాణ్యతను తెలిపే గ్రేడింగ్ యంత్రాలు, తేమశాతం నిర్ధారించే మిషన్లను ఏర్పాటు చేస్తున్నారు. మార్కెట్ లోని ధరల సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు అందజేసేలా, ఎల్ఈడీ బోర్డులను అమర్చనున్నారు. స్వచ్ఛమైన తాగునీటి కోసం ఆరు చోట్ల ఆర్ ఓ వాటర్ ప్లాంట్లు, పరిశుభ్ర మైన టాయి లెట్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తున్నారు. రైతుల ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం మార్కెట్ ప్రాంగణంలోనే హెల్త్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా, ఇస్కాన్ సహకారంతో రైతులకు రూ. 5కే రుచికరమైన భోజన వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రైతులకు మరింత సౌకర్యాన్ని కల్పించేందుకు, మార్కెట్ లోనే



బ్యాంకు కౌంటర్లను ఏర్పాటు చేయనున్నారు.

## డిజిటలైజేషన్

మార్కెటింగ్ వ్యవస్థను పూర్తిగా డిజిటలైజ్ చేసి, లావాదేవీల్లో పారదర్శకతను పెంచనున్నారు. అగ్నిప్రమాదాలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటూ, మార్కెట్ లోపల భద్రతా వ్యవస్థలను మరింత పటిష్టం చేస్తున్నారు. హమాలీలు, దడవాయిలకు ప్రత్యేక కార్యాలయ గదులను కేటాయిస్తున్నారు. రాబోయే 30 నుంచి 40 సంవత్సరాల వరకు ఎలాంటి ఆటంకాలు లేకుండా మార్కెట్ కార్యకలాపాలు కొనసాగేలా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఆధునికీకరణ పనులు చేపడుతున్నారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, ఆంధ్ర ప్రాంతాల నుండి రైతులు పంట అమ్ముకోవడానికి వచ్చే అవకాశాన్ని పరిగణనలోకి తీసుకుని, ఈ మార్కెట్‌ను విస్తృతంగా అభివృద్ధి చేస్తున్నారు.

## మంత్రి తుమ్మల పర్యవేక్షణ

మార్కెట్ పునర్ నిర్మాణ పనుల పురోగతిని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం కలెక్టర్ అనుదీప్ నిత్యం పర్యవేక్షిస్తున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను దేశానికే మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేస్తున్నారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేలా, రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ఆధునిక హంగులతో నిర్మాణాలు చేపడుతున్నట్టు వెల్లడిస్తున్నారు. వచ్చే సంక్రాంతి నాటికి పనులు పూర్తిచేసి, రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం, చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్ , సెక్రటరీ ప్రవీణ్ కుమార్.. పను లను నిత్యం పరిశీలిస్తూ, అధికారులు కాంట్రాక్టర్ కు పలు సూచ నలు చేస్తూ నిర్మా ణాల వేగానికి చర్యలు తీసుకుం టున్నారు. విస్తృత మైన ప్రణాళికతో, ఆధునిక సాంకేతికతను జోడించి, ఈ మార్కెట్‌ను దేశంలోనే ఆదర్శంగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నారు.

## అన్నదాతల హర్షం

సకల సౌకర్యాలతో, అత్యాధునిక హంగులతో పునర్నిర్మాణం అవుతున్న ఈ మార్కెట్, అన్నదాతలకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. తమ ఉత్పత్తులకు మంచి ధర లభిస్తుందని, అమ్మకం ప్రక్రియ సులభతరం అవుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దేశంలోనే ఒక ప్రత్యేకతను సంతరించుకునే ఈ మార్కెట్, ఖమ్మం జిల్లాకే కాకుండా, తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణంగా నిలవనుంది.

